ఈనాడు
పార్వతీపురం మన్యం
శుక్రవారం అక్టోబరు 11, 2024

దుర్గామాతగా కోటదుర్గమ్మ


అలంకరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహం

పాలకొండ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం కోటదుర్గమ్మ దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే ఆలయం రద్దీగా మారింది. ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కుంకుమ పూజల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. వడమ గ్రామం నుంచి మహిళలు ఘటాలతో ఆలయానికి ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

లక్ష్మీదేవిగా కామాక్షమ్మ

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు పట్టణంలో కామాక్షి అమ్మవారు గురువారం లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.



విజయనగరం వైభవోత్సవం

చూసొద్దామా..

రాజులు ఏలిన విజయనగరం ఘన చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పేలా రెండు రోజుల పాటు విజయనగరం-2024 ఉత్సవాలకు ఆదివారం శంఖం పూరించనున్నారు.

11 గంటలకు ప్రారంభం

ఆదివారం ఉదయం 8 గంటలకు పైడితల్లి ఆలయం నుంచి అయోధ్య మైదానం వరకు వివిధ కళారూపాలతో ఉత్సవ ర్యాలీ (కార్నివాల్) నిర్వహిస్తారు. 11 గంటలకు అయోధ్య మైదానంలో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారు.

★ అయోధ్య మైదానంలో రెండింటితో కలుపుకొని ఉత్సవాలను 12 వేదికలపై నిర్వహించనున్నారు.

★ గతం కంటే భిన్నంగా, వైవిధ్యంగా, ప్రత్యేకంగా ఈ ఏడాది కార్యక్రమాలు రూపకల్పన చేశారు. కోట వెనుక భాగంలో పైడిమాంబ చరిత్ర, విజయనగర వైభవాన్ని లేజర్ షో ద్వారా ప్రదర్శించడం ఈ ఏడాది ప్రత్యేకత. రంజని శివరంజనికి ఎదురుగా కోటపై సైతం రెండు రోజుల పాటు లేజర్ షో ఉంటుంది.

★ 14న తొలేళ్లు, 15న సిరిమాను సంబరం. ఈ సందర్భంగా ఉత్సవ శోభ నగరం నలుమూలలా అలరించేలా స్వాగత ద్వారాలను, ప్రభుత్వ భవనాలపై, పార్కుల్లో, ప్రధాన కూడళ్లలో మిరిమిట్లు గొలిపే లైటింగ్ ఏర్పాటు చేశారు.

★ అయోధ్య మైదానంలో గతంలో మెగా ఈవెంట్ ఒక్క రోజే జరిగేది. ఈసారి రెండు రోజులు నిర్వహించనున్నారు.



వేదిక 1 – అయోధ్య మైదానం

★ సాయంత్రం ఆరు గంటల నుంచి పది గంటల వరకు సంగీత విభావరి. ఈటీవీ జబర్దస్త్ కమెడియన్ హైపర్ ఆది స్కిట్లతో పాటు బెంగాల్ బృందంతో నృత్య ప్రదర్శన. సాహితి చాగంటి, సాయిచరణ్, అరుణ్ కౌండిన్య, దామిని భట్ల సంగీత ఆలాపన.

★ రెండో రోజు ఇదే వేదికపై సినీ గాయకుడు కార్తీక్ బృందంతో మెగా మ్యూజికల్ నైట్.

★ ఫుడ్ ఫెస్టివల్, పెట్‌షో. పారా మోటరింగ్.



వేదిక 2 – మహారాజా కోట

★ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సైన్స్ ఫెయిర్, స్టాంపులు, నాణేలు, ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శన.

★ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విజయనగరం చరిత్రను వివరించే లేజర్ షో. ఇక నుంచి దీన్ని ఏడాది పొడవునా కొనసాగిస్తారు.



సంగీత, సాంస్కృతిక, సాహిత్య నిలయమైన విజయనగరం ఉత్సవాలకు సిద్ధమైంది. పైడితల్లి సిరిమాను పండగకు అంగరంగ వైభవంగా ముస్తాబవుతోంది. కూటమి ప్రభుత్వం అందలమెక్కిన తర్వాత జిల్లాలో నిర్వహిస్తున్న తొలి వేడుక కావడంతో అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సంప్రదాయం ఉట్టిపడేలా.. సంస్కృతి వెల్లివిరిసేలా.. వైభవాన్ని చాటిచెప్పేలా, విజ్ఞాన వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. అలనాటి మధుర స్మృతులు గుర్తుకు తెచ్చేలా నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. – ఈనాడు, విజయనగరం

వేదిక 3 – గురజాడ కళాక్షేత్రం



★ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్థానిక కళాకారులతో నాటికల ప్రదర్శన. విజయనగర ఖ్యాతిని చాటిన వివిధ రంగాల ప్రముఖుల చిత్ర ప్రదర్శన.

వేదిక 4 – విజ్జీ స్టేడియం

★ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, స్కేటింగ్ పోటీలు.



భారీ బందోబస్తు

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆరు జిల్లాల నుంచి రెండు వేల మంది పోలీసులను బందోబస్తుకు రప్పిస్తున్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షణకు 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏరియల్ సర్వే, నిఘాకు మూడు డ్రోన్లు వినియోగించనున్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించారు.

వేదిక 5 – రాజీవ్ స్టేడియం

★ ఈ నెల 12 నుంచి 16 వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ప్రదర్శన.



వేదిక 6 – ఆనంద గజపతి కళా క్షేత్రం

★ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు.. సంగీత, నృత్య పోటీలు.



వేదిక 7 – ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్

★ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు భువన విజయం, శతాధిక కవి సమ్మేళనం, సాహితీ గోష్ఠి, సంగీత నవ అవధానం.



వేదిక 8 – లయన్స్ కమ్యూనిటీ హాల్

★ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు గిరిజన కళాకారులతో థింసా నృత్యాలు, కోలాటాలు, జానపద నృత్యాలు. విజయనగరం వైభవాన్ని చాటే లఘుచిత్రం ప్రదర్శన.



వేదిక 9 – బొంకుల దిబ్బ



★ సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు కన్యాశుల్కం, సత్య హరిశ్చంద్ర నాటకాల ప్రదర్శన.

వేదిక 10 – కోట

★ దీనికి ఎదురుగా ఉదయం 10 నుంచి సాయంత్రం 7 వరకు పులివేషాల ప్రదర్శన.



వేదిక 11 – మాన్సాస్ మైదానం (లోవర్ ట్యాంక్ బండ్ రోడ్)

★ ఈ నెల 10 నుంచి 20 వరకు జాతీయ స్థాయి సరస్ మేళా (చేనేత, హస్తకళల తయారీ ఉత్పత్తుల ప్రదర్శన).

★ 13, 14 తేదీల్లో రాత్రి పది గంటల వరకు పుష్ప, ఫల ప్రదర్శన.



దుకాణం దక్కే లక్కెవరికో?


దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

పార్వతీపురం, పట్టణం, సీతానగరం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయి. లాటరీలో ఒక్కటి దక్కినా చాలనే ఆలోచనలో వ్యాపారులు ఉన్నారు. గత వైకాపా పాలనలో మద్యం విక్రయాలను ప్రభుత్వం చేపట్టింది. గతంలో ఈ వ్యాపారాలు చేసిన వారంతా అయిదేళ్లు ఖాళీగా కూర్చున్నారు. శుక్రవారంతో దరఖాస్తుల గడువు ముగియనుంది. జిల్లాలో 52 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గురువారం మధ్యాహ్నానికి 1010 వచ్చాయి. అత్యధికంగా సాలూరు, తక్కువగా కురుపాం ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఉన్నాయి. పార్వతీపురంలో 151, సీతానగరంలో 208, కురుపాంలో 144, సాలూరులో 257, పాలకొండలో 250 వచ్చాయి.

ఏజెన్సీలో గిరిజనులకే ప్రాధాన్యం

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో మద్యం దుకాణాల కేటాయింపుపై ప్రభుత్వం విధి విధానాలు విడుదల చేసింది. ఏదైనా మండలంలోని గ్రామాలన్నీ షెడ్యూల్డ్ ప్రాంతంలోనే ఉంటే అక్కడి దుకాణాలను స్థానిక గిరిజనులకే కేటాయించాలి. ఒకవేళ వారు దరఖాస్తు చేయకపోతే స్థానికేతర గిరిజనులకు ఇస్తారు. కొన్ని మండలాల్లో కొన్ని గ్రామాలే షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉండి.. మిగిలినవి ఇతర ప్రాంతాలుగా నమోదై అక్కడ గిరిజనేతరులకు లాటరీలో కేటాయిస్తే వారు కేవలం నాన్ షెడ్యూల్డ్ ప్రాంతంలో మాత్రమే నిర్వహించాలి. అదే గిరిజనుల్లో ఎవరికైనా దుకాణం ఏర్పాటు చేసే అవకాశం వస్తే వారు మండలంలో ఎక్కడైనా నిర్వహించుకోవచ్చు. ◆ షెడ్యూల్డ్ ప్రాంతంలో దుకాణం ఏర్పాటుకు గ్రామసభ తీర్మానం విధిగా ఉండాలని పార్వతీపురం అబ్కారీ సహాయ పర్యవేక్షణాధికారి జీవన్‌కిశోర్ వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనులు ఈనెల 14న లాటరీ తీసేటప్పుడు విధిగా ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం, ఎంట్రీ పాసు తీసుకురావాలని తెలిపారు.

కొండలపై.. అభివృద్ధికి బాటలు

మన్యంలోని కొండలపై చాలా గ్రామాలకు ఇప్పటికీ సరైన దారే లేదు. అక్కడి గిరిజనులు గుట్టలు ఎక్కి.. రాళ్లపై దిగుతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న అయిదేళ్లు రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. ఫలితంగా అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే ఏ వాహనం వచ్చే అవకాశం లేక డోలీలే దిక్కవుతున్నాయి. అటవీ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లాలన్నా అష్టకష్టాలు పడాల్సిందే. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో మన్యంలోని గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


లప్పటి-వాడబాయి మార్గమిది. రూ.2.80 కోట్లతో బీటీ రహదారి వేయనున్నారు.

రహదారుల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజనుల కష్టాలను చూసిన తెదేపా ప్రభుత్వం 2017-18లోనే రహదారుల నిర్మాణాలకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేసింది. సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులు ప్రారంభించారు. కొన్ని చోట్ల మట్టిరోడ్లు వేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని వదిలేయడంతో వర్షాలకు పలు చోట్ల కొట్టుకుపోయాయి. దారులు నిర్మించి కష్టాలు గట్టెక్కించాలని అధికారులకు విన్నవించినా.. ప్రజాప్రతినిధులను నిలదీసినా ప్రయోజనం లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో గిరిజనులే సొంతంగా నిధులు సమకూర్చుకుని శ్రమదానంతో నిర్మించుకున్నారు.

ఎక్కడ.. ఏ దారి వేయనున్నారంటే..

మండలం	మార్గం	నిధులు (రూ.లక్షల్లో)
గుమ్మలక్ష్మీపురం	దొరజమ్ము-బొడ్లగూడ (బీటీ)	110
	లప్పటి-వాడబాయి (బీటీ)	280
	యూనియన్ బ్యాంక్-గడ్డికాలని (సీసీ)	40
కురుపాం	టీజీ రహదారి-మరిపల్లి (బీటీ)	110
	మంటికొండ-చినఅంటిజోల, డెప్పిగూడ (బీటీ)	145
	డి.బారామణి- ఎర్రిగెడ్డగూడ (బీటీ)	80
	రక్షణ గోడ మాలత్మ ఆలయం	80
	ఎంఎన్ రహదారి- ఉరిడి (బీటీ)	150
	టీజీ రహదారి- దురిబిలి (బీటీ)	70
జియ్యమ్మవలస	కొండచిలకాం-ద్రాక్షిణి (బీటీ)	140
	కుదమ-గదబవలస (బీటీ)	120
	పీజే రహదారి- లోతువానివలస (బీటీ)	80
	డంగభద్ర- డంగభద్రవలస (బీటీ)	130
	రక్షణగోడ (వీఆర్ ప్రాజెక్ట్, వీఆర్‌పురం)	19.04
	తోటపల్లి, గుణుపూర్ రహదారి- బాసింగి గదబవలస(బీటీ)	260
కొమరాడ	తొడుము-కొట్టు (బీటీ)	3

16 పనులకు రూ.18.17 కోట్లు

ఏజెన్సీలో రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో 16 రహదారులకు రూ.18.17 కోట్లు ఇచ్చింది. ఇందులో బీటీ, సిమెంట్ దారులు ఉన్నాయి. ఇప్పటికే మంజూరైన ప్రాంతాల్లో రహదారులను పంచాయతీరాజ్ శాఖ అధికారులు పరిశీలించి సాంకేతిక మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న పల్లె పండగలో భాగంగా రహదారులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించనున్నారు.

14 నుంచి భూమిపూజ

మంజూరైన పనులకు ఈనెల 14 నుంచి 21 వరకు భూమిపూజ చేయనున్నారు. ఎనిమిది పనులకు సాంకేతిక మంజూరు వచ్చింది. మిగిలిన వాటికి త్వరలో వచ్చే అవకాశముంది. ఏడాదిలోపు పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.
– శ్రీనివాసరావు, పంచాయతీరాజ్, డీఈఈ

ధాన్యం కొనుగోలు లక్ష్యం 2.20 లక్షల టన్నులు


మాట్లాడుతున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, పాల్గొన్న జేసీ, సబ్ కలెక్టర్లు

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2.70 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోందని వెల్లడించారు. అందులో 2.20 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు ప్రభుత్వం అనుమతించిందని పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లతో పాటు అవసరమైన సంచులు, పరికరాలు ముందుగా సమకూర్చుకోవాలన్నారు. రైతులకు నగదు చెల్లింపులకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగా వారి ఖాతా వివరాలను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. మిల్లర్లకు యంత్రాంగం అండగా ఉంటుందని, వారు కూడా రైతులకు సహకరించాలని సూచించారు. అధికారులు, అన్ని శాఖల సమన్వయంతో ధాన్యం కొనుగోలును విజయవంతం చేయాలన్నారు. జేసీ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కుమార్ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ డీఎం శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, జీసీసీ డీఎం మహేంద్రకుమార్, సీతంపేట జీసీసీ మేనేజర్ కృష్ణ, మిల్లర్ల సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తామని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉద్యోగ విరమణ చేసిన, హోంగార్డులు తదితర కుటుంబీకులతో సమావేశం నిర్వహించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగతంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల వివరాలపై ఆరా తీశారు. అన్ని విధాలా అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు. విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన సిబ్బంది పి.శ్రీనివాసరావు సతీమణి రజినికుమారికి వితంతు సహాయం కింద రూ.50 వేల చెక్కు అందజేశారు. ఎస్పీ అందరికీ స్వయంగా భోజనాలు వడ్డించారు. ఎస్బీ సీఐ జీడీ బాబు, ఏఆర్ ఆర్‌ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బంది కుటుంబీకులకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ఇకపై ఆన్‌లైన్‌లోనే విద్యుత్తు బిల్లులు

విద్యుత్తు బిల్లులు ఇకపై ఆన్‌లైన్‌లోనే రానున్నాయి. ఇందుకు సంబంధించిన స్మార్ట్‌మీటర్లు అందుబాటులోకి వచ్చాయి. పాలకొండ విద్యుత్తు శాఖ సబ్ డివిజన్ పరిధిలో 8,400 కొత్త మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య, వ్యాపార సముదాయాలకు అమర్చుతున్నారు. వీటిలో సిమ్‌ను పెట్టడంతో విద్యుత్తు వినియోగం నేరుగా అధికారులకు చేరుతుంది. తర్వాత ఆన్‌లైన్‌లోనే బిల్లులు అందించనున్నారు. వచ్చే నెల నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ గోపాలకృష్ణ తెలిపారు.
– న్యూస్‌టుడే, పాలకొండ


నరేగా కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్లు



జస్టిస్ తుషార్‌రావుకు మొక్క అందజేస్తున్న డీఎస్పీ రాంబాబు, చిత్రంలో సీఐ చంద్రమౌళి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుషార్‌రావును పాలకొండ డీఎస్పీ రాంబాబు, సీఐ చంద్రమౌళి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా స్వగ్రామమైన వీరఘట్టం మండలం కత్తులకవిటి వచ్చిన ఆయనను వీరితో పాటు పలువురు న్యాయవాదులు కలిశారు.
– న్యూస్‌టుడే, పాలకొండ

పూర్వ విద్యార్థుల ఉదారత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి గురుకుల పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న హర్షవర్ధన్ ఇటీవల అనారోగ్యానికి గురై విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంతవరకు దాదాపు రూ.9 లక్షలు ఖర్చైంది. బాధిత తల్లిదండ్రులకు చేయూత అందించాలన్న ఉద్దేశంతో గురువారం రూ.లక్ష చెక్కు, రూ.25 వేలు నగదు అందజేసినట్లు పూర్వ విద్యార్థుల సంఘ నేత జోగినాయుడు తెలిపారు.

గౌరీశ్వరరావుకు 'రైతు నేస్తం' పురస్కారం



రాజాం, న్యూస్‌టుడే: ప్రకృతి సేద్యం రైతు పెంకి గౌరీశ్వరరావుకు 'రైతు నేస్తం' పురస్కారం వరించింది. స్వర్ణభారతి ట్రస్టులో ఈనెల 20న ముప్పవరపు ఫౌండేషన్, రైతు నేస్తం సంస్థల ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందుకోనున్నట్లు ఆయన గురువారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈయన దశాబ్ద కాలంగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. వరి, అపరాలతో పాటు జీడి, మామిడి తోటలను ఈ పద్ధతిలోనే సాగు చేస్తున్నారు.



వడ్డివీధి రామమందిరం సమీపంలోని రహదారిపై పేరుకున్న వ్యర్థాలు

సాలూరు పట్టణం.. చెత్తమయం



డబ్బివీధిలో ఇలా..

సాలూరు పట్టణంలో పారిశుద్ధ్య పనులు కొరవడ్డాయి. వార్డుల్లో ఎక్కడికక్కడే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన డంపర్‌బిన్లు నిరుపయోగంగా మారాయి. వాటిల్లోని వ్యర్థాలను తరలించే రెండు కాంపాక్టర్ వాహనాలు లేకుండా పోయాయి. రెండు నెలల క్రితం మరమ్మతులకు గురైన వాహనాన్ని విజయనగరం తరలించారు. రెండోది ఇప్పటికే మూలకు చేరింది. 29 వార్డుల పరిధిలో ఉన్న 35 డంపర్‌బిన్లు చాలావరకు పాడయ్యాయి. దీనిపై ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ మాట్లాడుతూ వాహనాలను బాగుచేస్తామని, వ్యర్థాలు తరలేలా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

డీఎస్సీలో సత్తాచాటిన జిల్లావాసులు

తెలంగాణకు మన గురువులు

గత అయిదేళ్లు డీఎస్సీ కోసం ఎదురు చూశారు.. అభ్యర్థుల ఆందోళనతో దిగొచ్చిన నాటి ప్రభుత్వం చివరి నిమిషంలో ప్రకటనిచ్చింది. ఈలోపు ఎన్నికలు రావడంతో వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి.. ఈక్రమంలో తెలంగాణ డీఎస్సీ వారి కలల కొలువుకు మార్గం చూపింది.. పట్టుబట్టి చదవి.. ఉద్యోగాలు పొందారు జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు. బుధవారం జిల్లాలు కేటాయిస్తూ అక్కడి అధికారులు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కొందరు 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు.



వివాహమైనా..

నాకు వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. వారి బాగోగులు, చదువులు చూసుకోవాలి. ఇదంతా నాణేనికి ఒకవైపైతే.. ఉపాధ్యాయురాలిని కావాలన్న లక్ష్యం మరోవైపు. కుటుంబ సభ్యుల సహకారంతో అటువైపే అడుగులు వేశా. 2016లో డైట్ శిక్షణ పూర్తయింది. డీఎస్సీ కోసం గతంలో తర్ఫీదు పొందా. తరువాత ఇంటి వద్దే సాధన చేశా. భర్త కృష్ణ వసతిగృహ సంక్షేమాధికారిగా చేస్తున్నారు. ఆయనతో పాటు తల్లిదండ్రులు, అత్తమామలు ప్రోత్సహించారు. తెలంగాణ డీఎస్సీలో 80.17 మార్కులతో కుమురం భీం జిల్లాలో ఉద్యోగం పొందా.
– స్వాతి, కనిమెరక

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

ఆడపిల్లలను చాలా మంది బయటకు పంపించరు. కానీ నాపై ఉన్న నమ్మకంతో మా తల్లిదండ్రులు విజయలక్ష్మిబాయ్, అప్పలాచారి ఏనాడూ అడ్డు చెప్పలేదు. వారి ప్రోత్సాహంతో ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ముందుకెళ్లా. 2014- 16 బ్యాచ్‌లో డీఎల్ఈడీ పూర్తిచేశా. ఏపీ డీఎస్సీ- 2019 రాసినా అవకాశం రాలేదు. ఈసారి 80.77 మార్కులు సాధించా. హైదరాబాద్ జిల్లా కేటాయించారు. ఎంతో సంతోషంగా ఉంది. ఏపీ డీఎస్సీకి పోటీ పడేందుకు సిద్ధమవుతున్నా.
– ఎ.ప్రవల్లిక, పున్నపురెడ్డిపేట





ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా..

బీటెక్ చదివినా సాఫ్ట్‌వేర్ వైపు వెళ్లాలని పించలేదు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో తొలుత సచివాలయ సంక్షేమ సహాయకుడిగా ఎంపికయ్యా. కొన్ని నెలలకే దానిని వదిలి డీఎస్సీ రాశా. 2022, 2023లో తెలంగాణ టెట్‌లో రెండు సార్లు వరుసగా మూడో స్థానంలో నిలిచా. 2022 ఏపీ టెట్‌లో 150కి 129 మార్కులొచ్చాయి. ఈసారి ఆఖరి పరీక్షలో వందకు 84.83 లభించాయి. స్కూల్ అసిస్టెంట్ గణితం విభాగంలో మొదటి ర్యాంకు దక్కింది. నాకు ఖమ్మం జిల్లా కేటాయించారు. మా సొంతూరు శ్రీకాకుళం జిల్లా భగీరథపురం. తల్లిదండ్రులు జయలక్ష్మి, శ్రీనివాస్. తాతయ్య, అమ్మమ్మ నగరంలో ఉండడంతో వాళ్ల దగ్గరే పెరిగా. వారి స్ఫూర్తితో కొలువు సాధించా.
– కేవీఎస్.శ్రీరామ్, విజయనగరం

తల్లి కష్టానికి ప్రతిఫలం..

మాది పేద కుటుంబం. తండ్రి గొల్లయ్య పదేళ్ల క్రితం మరణించారు. తల్లి సత్తెమ్మ కష్టపడి చదవించారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యా. ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలని విజయనగరంలో ఉంటూ సాధన చేశా. ట్యూషన్లు చెప్పేవాడిని. అలా వచ్చిన నగదుతో ఫీజులు కట్టేవాడిని. తాజా డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ కేటగిరీలో 82.23 మార్కులు వచ్చాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో 5వ ర్యాంకు సాధించా. నా మాతృమూర్తి కష్టానికి ప్రతిఫలం దక్కింది.
– వై.గణేష్, గదబవలస



– న్యూస్‌టుడే, విద్యావిభాగం, గరివిడి, గుర్ల

ఉరేసుకుని కార్మికుడి ఆత్మహత్య?



దేవుడునాయుడు (పాతచిత్రం)

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ బీకాలనీ సమీపంలో ఓ కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై గోపాలరావు వివరాల ప్రకారం.. వేపాడ మండలం పెద్దగుడిపాలెం గ్రామానికి చెందిన దేవుడునాయుడు(32) అరకులోయలోని ఓ మిఠాయి దుకాణంలో పది రోజుల క్రితం పనిలో చేరాడు. మరో దుకాణంలో పనిచేస్తున్న చిన్న అనే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని నాలుగు రోజుల కిత్రం తెలిసిన వ్యక్తికి ఇచ్చాడు. సదరు వ్యక్తి వాహనం తీసుకురాలేదు. దీనిపై చిన్న ప్రశ్నించడంతో మానసిక వేదనకు గురై ప్రాణాలు తీసుకుని ఉంటాడని ఎస్సై తెలిపారు. అయితే ఆత్మహత్య కాదని బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రుణ భారంతో వ్యాపారి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మురళి

భోగాపురం, న్యూస్‌టుడే: 'ఎంతో ప్రశాంతంగా సాగిన నా జీవితం మూడు నెలల్లో ఒక్కసారిగా తలకిందులైంది. నిజాయతీగా నేను చేస్తున్న చిట్టీలు, వ్యాపారాల్లో ఏనాడూ మాట పడలేదు. కొందరు నాకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకపోవడంతో తీసుకున్న అప్పులను తీర్చలేకపోతున్నా. ఆస్తులు అమ్మినా తీరని పరిస్థితి. ఇక నాకు మరణమే శరణ్యమని భావించా' అంటూ భోగాపురానికి చెందిన వ్యాపారి టి.మురళి సుందరపేట ఆసుపత్రిలో అపస్మారక స్థితిలోకి వెళ్లకముందు చెప్పిన మాటలివి.. అప్పుల బాధ భరించలేక గడ్డిమందు తాగి ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన గురువారం స్థానికంగా చోటుచేసుకుంది. ఉదయం నిద్రమాత్రలు, గడ్డిమందు తాగి గ్రామ పెద్దల వద్దకు వెళ్లి తాను చేసిన తప్పునకు కుటుంబం బలికాకూడదు అంటూ వారి వద్ద మొరపెట్టుకుంటూ కుప్పకూలారు. వెంటనే వారు సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యుడు వెంకటేశ్ పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యానికి విజయనగరం తీసుకెళ్లాలని సూచించారు. ఆయనకు భార్య తులసి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి ఈయన వద్దే ఉంటున్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ తౌడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించినట్లు సీఐ ప్రభాకరరావు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ బాలిక చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. కురుపాం మండలానికి చెందిన బాలిక సరిగ్గా చదువుకోవడం లేదని, కళాశాలకు వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో గత నెల 20న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కురుపాం సీహెచ్‌సీకి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం, అక్కడి నుంచి విజయనగరం, విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చంపావతి తీరంలో గంజాయి



మాట్లాడుతున్న డీఎస్పీ

గుర్ల, న్యూస్‌టుడే: మండలంలోని చంపావతి నదీ తీరంలో గంజాయి అమ్మకాలు సాగిస్తున్న, కొనుగోలు చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను డీఎస్పీ రాఘవులు గురువారం సాయంత్రం వెల్లడించారు. అరకు మండలం సుంకరమెట్టకు చెందిన ఎం.అప్పన్న, అలమండకు చెందిన డి.గాంధీ ఎస్ఎస్ఆర్‌పేట సమీపంలోని నదీ పరివాహక ప్రాంతంలో కొంత మందికి గంజాయి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు సీఐ శంకరరావు, ఎస్సై నారాయణరావు సిబ్బందితో కలిసి దాడులు చేసి.. వారిద్దరితో పాటు విజయనగరానికి చెందిన మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కిలోల సరకు, అయిదు చరవాణులు, రూ.1250 నగదును స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ చెప్పారు. ఒడిశా నుంచి ఇక్కడకు తెచ్చి విక్రయిస్తున్నారని చెప్పారు.

నగరంలో అంతర్రాష్ట్ర మహిళా ముఠా హల్‌చల్



తాళాలు పగలగొడుతున్న మహిళలు

నేరవార్తావిభాగం: విజయనగరంలో అంతర్రాష్ట్ర మహిళా ముఠా హల్‌చల్ చేసింది. ఆరుగురు మహిళలు బుధవారం అర్ధరాత్రి పలు దుకాణాలకు వెళ్లి తాళాలు పగలగొట్టే ప్రయత్నం చేశారు. రాత్రి 2 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు పలు వీధుల్లో తిరిగారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో నిక్షిప్తం కావడంతో దుకాణదారులు భయాందోళన చెందారు. సదరు మహిళలు పగటి వేళ చెత్త ఏరుకుంటున్నట్లు.. బిక్షాటన చేస్తూ వీధుల్లో తిరుగుతున్నట్లు తెలుస్తోంది. వారి సంచుల్లో షట్టర్లు, తలుపులను పగలగొట్టే పరికరాలు ఉన్నాయి. రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు భావిస్తున్నారు. ఈమేరకు వివరాలు సేకరిస్తున్నామని ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.

పెనుగొల్లులో లారీ, ఆర్టీసీ బస్సు ఢీ

జిల్లావాసికి తీవ్ర గాయాలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ నుంచి సూపర్ లగ్జరీ నాన్‌స్టాప్ 36 మందితో విశాఖ బయలుదేరింది. పెనుగొల్లు వద్ద ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై విభీషణరావు బస్సును పరిశీలించి, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో విజయనగరానికి చెందిన ఎం.చాణక్యకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం విశాఖలో చికిత్స పొందుతున్నారు.

20 అడుగుల లోయలో వ్యాన్ బోల్తా: కూలీ దుర్మరణం



వాహనం వద్ద మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సతీష్(పాతచిత్రం)

సీతంపేట, న్యూస్‌టుడే: వ్యాను అదుపుతప్పి లోయలో పడడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన సీతంపేట మండలం చోటుచేసుకుంది. ఎస్సై అమ్మన్నరావు వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట నుంచి చరవాణి టవర్ల సామగ్రితో వస్తున్న వ్యాను కోతాం సమీపంలోని ఘాట్ రోడ్డులో బ్రేకులు విఫలమవడంతో అదుపుతప్పి 20 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కూలి కె.సతీష్(33) అక్కడికక్కడే మృతిచెందాడు. చోదకుడు లోవరాజు, మరో వ్యక్తి శ్రీను గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



దుర్గమ్మగా రామలింగాపురం మానసాదేవి

అమ్మలగన్నమ్మా.. ఆదుకోవమ్మా

దుర్గాష్టమి సందర్భంగా గురువారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. రామలింగాపురం మానసాదేవిని దుర్గమ్మగా పూజించారు. నగరంలోని నాగోజీపేట దుర్గాలమ్మను గాజులతో అలంకరించారు.
– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్, చీపురుపల్లి గ్రామీణం



గాజుల అలంకరణలో నాగోజీపేట దుర్గాలమ్మ

అవార్డులొచ్చాక.. అటకెక్కించారు

– న్యూస్‌టుడే, బొబ్బిలి

చెత్త శుద్ధిలో బొబ్బిలి పురపాలిక ఒకప్పుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలోనూ పేరు తెచ్చుకుంది. ఇంటింటా చెత్త సేకరణలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో, జాతీయ స్థాయిలో 501 ర్యాంకును సాధించింది. జోనల్ స్థాయిలో ఎనిమిదో ర్యాంకును అందుకుంది. వ్యర్థాల నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించిన మూడు పట్టణాల్లో బొబ్బిలి కూడా ఒకటి. ఇదంతా ఒక ఎత్తయితే.. ప్రశంసలు దక్కాక.. ప్రాజెక్టునే పక్కన పెట్టేశారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం యూనిట్‌లో విలువైన యంత్రాలన్నీ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆందోళన వ్యక్తమవుతోంది.



నిరుపయోగంగా విలువైన యంత్రాలు

ప్రారంభంలోనే తుంచేశారు

తడి చెత్తతో వినూత్న పద్ధతిలో ఎరువు తయారీ చేసే విధానాన్ని గతేడాది డిసెంబరులో ప్రారంభించారు. లార్వా కంపోస్టు విధానంలో 15 రోజుల్లోనే ఎరువు సిద్ధమవుతుంది. రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా ఇక్కడ ప్రవేశపెట్టారు. ఇందుకోసం 30 ట్యాంకులు అమర్చారు. వీటిల్లో చెత్త, దానిపై బీఎస్ఎఫ్(బ్లాక్ సోల్డియర్ ఫ్లై) గుడ్లను వేస్తే. . అవి పురుగులుగా మారి తడిచెత్తను ఆహారంగా తింటాయి. అవి విసర్జించే వ్యర్థాలు ఎరువుగా మారుతాయి. ఇలా రోజుకు 40 కిలోల చొప్పున ఈ ప్రక్రియలో వినియోగించేవారు. మొదట్లో కొన్నిరోజుల పాటు బాగానే పనిచేసినా.. అనంతరం ఆపేశారు.

ప్రక్రియలన్నీ మూలకు..

చెత్తశుద్ధి పార్కు నిర్మాణం, ప్లాస్టిక్ నిషేధం, తడిచెత్తతో ఎరువు తయారీ, పొడిచెత్తలో పనికొచ్చే వ్యర్థాలు విక్రయించడం, బయోగ్యాస్‌తో విద్యుత్తు తదితర ప్రక్రియలతో పట్టణం దేశంలోనే ఆదర్శంగా పేరు తెచ్చుకుంది. ఇప్పుడీ విధానాలు వెతికినా కనిపించడం లేదు. తడిచెత్త నిర్వహణను ప్రత్యేక ఏజెన్సీకి అప్పగించారు. పొడిచెత్త బాధ్యతను పురపాలిక చేపట్టింది. ఈ రెండూ ఆగిపోయాయి. ప్యాకింగు, పల్వరైజర్ యంత్రాలు, బయోగ్యాస్ ప్లాంటు మూలకు చేరాయి. వ్యర్థాలను వేరుచేసే యూనిట్‌కు తాళాలు వేశారు. గతంలో పొడి చెత్తతో ఏడాదికి రూ.1.50 లక్షల చొప్పున ఆదాయం వచ్చేది. ఎరువు అమ్మకాల ద్వారా రూ.2 లక్షలు దక్కేది. ఇప్పుడు రూపాయి కూడా అందని పరిస్థితి. పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి యంత్రాలు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు.



సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం వద్ద పనిచేయని యూనిట్

హోటళ్లపై ఆకస్మిక దాడులు



ప్రసాదాలను పరిశీలిస్తున్న ఈశ్వరి

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాలతో ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు గురువారం జిల్లా కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ విభాగం పర్యవేక్షణాధికారిణి ఎస్.ఈశ్వరి పైడితల్లి అమ్మవారి ఆలయంలో ప్రసాదం తయారీ విభాగాన్ని పరిశీలించారు. నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగుల్ మీరా తన బృందంతో కలిసి పలు హోటళ్లు, అల్పాహార దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. తయారీదారులు తీసుకుంటున్న జాగ్రత్తలు, వాడుతున్న ఆహార పదార్థాలు, పాటిస్తున్న నియమ, నిబంధనలను చూశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి పనుల నమోదుకు కొత్త బోర్డులు



ఏర్పాటు కానున్న బోర్డు నమూనా

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలకు సంబంధించి సమాచారం పొందుపరిచేందుకు కొత్తగా బోర్డులు రూపొందించారు. గతంలో సిమెంటు బోర్డులు నిర్మించి వాటిపై వివరాలు రాసేవారు. 2024-25 ఏడాదిలో చేపడుతున్న పనులకు కొత్త రకం ఏర్పాటు చేయాలని నమూనా రూపొందించి పంపించారు. చేపట్టిన పనులు, పూర్తయినవి, సిమెంటు రహదారులు, తారు రోడ్లు, గోకులాలు, పండ్ల తోటలు, పంట కాలువల వివరాలు రాయనున్నట్లు బొబ్బిలి ఏపీవో లక్ష్మీపతిరాజు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

ఆసుపత్రి ప్రసవాలపై దృష్టిసారించాలి


సమీక్ష నిర్వహిస్తున్న అధికారి జగన్మోహనరావు

వీరఘట్టం, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని వైద్యఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి. జగన్మోహనరావు అన్నారు. మండలంలోని విటివాడ పీహెచ్‌సీని గురువారం సందర్శించారు. ఉద్యోగులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి పోషకాహారంతోపాటు ఐరన్, కాల్షియం మాత్రలు వేయించాలని చెప్పారు. గ్రామాల్లో తరచూ సర్వేలు నిర్వహిస్తూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యాధికారులు మానస, నీలి, డెమో యోగేశ్వరరెడ్డి, పర్యవేక్షకులు శ్రీనివాసరావు, ఇందిరాదేవి, లలితకుమారి, చిన్నబాబు ఉన్నారు.

పాలన అనుభవం అవసరం: సీఈవో


సదస్సులో మాట్లాడుతున్న సీఈవో సత్యనారాయణ

పార్వతీపురం గ్రామీణం, సీతానగరం, న్యూస్‌టుడే: పంచాయతీ ఉపసర్పంచులు, సభ్యులుగా ఎన్నికైన వారికి పాలనపై అనుభవం ఉండాలని జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) సత్యనారాయణ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వారికి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రతి సభ్యుడు పరిశీలించాలన్నారు. ఎంపీడీవో రూపేష్, త్రివిక్రమరావు, ఏవో మూర్తి, టీవోటీలు శ్రీనివాస్, మనోహర్, శోభారాణి, డీఆర్పీ జగన్మోహనరావు వివిధ అంశాలపై మాట్లాడారు.

సమన్వయంతో సరిహద్దు అభివృద్ధి


కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరితో..

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: సోదర భావం, సమన్వయంతో ముందుకెళితేనే ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాలను అభివృద్ధి పథంలో తీర్చిదిద్దేందుకు కృషిచేద్దామని రాయగడ, కురుపాం ఎమ్మెల్యేలు అప్పలస్వామి, జగదీశ్వరి అభిప్రాయపడ్డారు. గురువారం రాయగడ మజ్జిగౌరమ్మను ఎమ్మెల్యే జగదీశ్వరి కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. అనంతరం అక్కడి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. సరిహద్దులోని రహదారులు, జంఝావతి రబ్బరు డ్యాం వంటి అంశాలు చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పనులు పూర్తిచేసేందుకు కృషిచేస్తామని అప్పలస్వామి తెలిపారు.

జీవితంలో మరువలేనిది స్నేహమొక్కటే


మిత్రులతో కలసి ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: ప్రతి మనిషి జీవితంలో మరువలేనిది స్నేహమొక్కటేనని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. గురువారం ఓ హోటల్‌లో తనతో కలసి చదువుకున్న స్నేహితులతో ఆనందంగా గడిపారు. జీవితంలో ఉన్నతమైన స్నేహం దొరికిన వ్యక్తి ఉన్నతికి రాచబాట వేస్తుందన్నారు. చిన్నతనం నుంచి అనుబంధాన్ని సాధించాలనే లక్ష్యమే విజయచంద్రను ఈ స్థానంలో నిలిపిందని స్నేహితులు వారి అనుభవాలను పంచుకున్నారు. గత స్మృతులను గుర్తుచేసుకుంటూ సరదాగా గడిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

(10 AM TO 1 PM)

? తుమరాడ సచివాలయం నుంచి చర్చి వరకు మిగిలిన తారురోడ్డు పనులు పూర్తి చేయక ఇబ్బందులు పడుతున్నాం. - **రామకృష్ణ**

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తదుపరి చర్యలు తీసుకుంటాం. - **అంబేడ్కర్, పీఆర్ జేఈ** – న్యూస్‌టుడే, బలిజిపేట

? వెలగవాడగూడ నుంచి ఆగంగూడ వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. - **రామకృష్ణ**

● పరిశీలించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. - **అప్పారావు, జేఈ** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? శ్మశానం ఆక్రమణలతో అంతరించిపోతోంది. మృతదేహాలను తీసుకువెళ్లడానికి ఇబ్బందిగా మారింది. - **బలగ శంకరరావు**

● పరిస్థితి పరిశీలించి వీఆర్వోతో చర్యలు ప్రతిపాదిస్తాం. - **రామకృష్ణ, ఆర్ఐ** – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? పాలకొండ నీలమ్మకాలనీలో బోరు పనిచేయడం లేదు. - **రాజేష్, వ్యాపారి**

● మరమ్మతులు చేపట్టి వినియోగంలోనికి తీసుకొస్తాం. - **దేవిశ్రీప్రసాద్, ఏఈ** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

పత్తి రైతుకు విక్రయ పాట్లు

కూటమి ప్రభుత్వంపైనే పత్తి రైతుల ఆశలు

భామిని, న్యూస్‌టుడే: తెల్ల బంగారంగా ప్రసిద్ధిగాంచిన పత్తి పంట సాగు చేస్తున్న రైతులకు గత ప్రభుత్వం ప్రోత్సాహం అందించలేదు. భామిని మండలంలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారు. సుమారు 2,165 ఎకరాల పంట ఈ-క్రాప్‌లో నమోదు అయ్యింది. కొండపోడులో మరో 3000 ఎకరాల్లో పత్తి సాగు చేపడుతున్నారు.

15 వేల ఎకరాల్లో సాగు..

ఉమ్మడి జిల్లాలోని కొత్తూరు, పాచిపెంట(?), సాలూరు, జీఎల్‌పురం, సీతంపేట మండలాల్లో 15 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఏటా పంట విస్తీర్ణం పెరుగుతోంది. కానీ, నిల్వ చేసేందుకు కొనుగోలు కేంద్రాలు లేకుండా పోయాయి. దీంతో అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టి తక్కువ ధరకే దళారుల చేత పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గతేడాది క్వింటాకు ధర రూ.7,100 పలికింది. దీంతో పెట్టుబడి కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా చర్యలు లేవు.


లారీలో పత్తిని ఎక్కిస్తున్న దృశ్యం (పాత చిత్రం)

రాజాంలో కొనుగోలు కేంద్రం..

గతంలో రాజాంలో పత్తి కొనుగోలు కేంద్రం ఉండేది. జిల్లాలో అత్యధికంగా పండించే భామిని మండల రైతులు ఇక్కడికి వ్యయప్రయాసలు పడి పంటను తీసుకెళ్లేవారు. కానీ, కొంత మంది దళారులతో చేతులు కలిపి తీసుకొచ్చిన పంటలో తేమ శాతం అధికంగా ఉందని, నాణ్యత లేదని తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఎక్కడా నిల్వ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో పంటకు గిట్టుబాటు ధర రాకపోగా రవాణా ఖర్చులు పెరగడంతో దళారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.

కేంద్రాలు లేక నష్టపోతున్నాం...



ఏళ్లుగా పత్తిసాగు చేపడుతున్నాం. పంటను నిల్వ చేయడానికి స్థలం లేదు. దీంతో వర్షానికి తడిసిపోతే నష్టపోవాల్సి వస్తోంది. భామినిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.
– జి.లక్ష్మీపతినాయుడు, పత్తి రైతు, భామిని

ఆదేశాలు రావాల్సి ఉంది

ఏటా అక్టోబరు ఆఖరి వారంలో రాజాంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం. రైతులకు అందుబాటులో ఉండేలా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. మరోసారి జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్తామన్నాం.
– కె. సింహాచలం, మండల వ్యవసాయాధికారి, భామిని

అవగాహనతో కంటి చూపు భద్రం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుంటే కంటి చూపును భద్రంగా ఉంచుకోవచ్చని జిల్లా ఆసుపత్రి ఆర్‌ఎంవో, నేత్ర వైద్య నిపుణులు శ్యామల అన్నారు. గురువారం ఆసుపత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక శిబిరం నిర్వహించారు. నేత్ర సంబంధ ఇబ్బందులున్న వారికి పరీక్షలు చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా అధికారి నగేష్‌రెడ్డి, నేత్ర వైద్యనిపుణులు సుకుమార్ బాబు నేత్ర సంబంధ ఇబ్బందులు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.

జియ్యమ్మవలసలో దాహం కేకలు


నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: జియ్యమ్మవలసలో కొద్ది రోజులుగా తాగునీరు అందకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం పంచాయతీ సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో 90 వేల లీటర్ల సామర్థ్యంతో రక్షిత నీటి పథకం ఉంది. బొమ్మిక గెడ్డ నుంచి రక్షిత నీటిని తీసుకురాగా తాగునీటి పంపిణీ గొట్టాల్లో ఇబ్బందులు తలెత్తడంతో నాలుగు రోజులుగా సక్రమంగా నీరు రావడం లేదు. ప్రధాన రహదారితో పాటు అర్నాడ, బొమ్మిక, ఎమ్మార్వో వీధుల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భరత్‌చంద్ర మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

అక్కడ తీసి.. ఇక్కడ వదిలేశారు



పార్వతీపురం పట్టణంలోని సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో జనావాసాల వద్ద కాలువల్లోని మురుగు తీయకుండా వదిలేశారు. ఇటీవల మున్సిపల్ సిబ్బంది ఖాళీ ప్రదేశాల్లో మురుగు తీసి, పిచ్చిమొక్కలు తొలగించారు. జనావాసాలున్న దగ్గర మురుగు తీయకుండా వదిలేశారు. అదే కాలువ గుండా తాగునీటి పైపులైను ఉంది. ఇలా వదిలేస్తే తాగునీరు కూడా కలుషితం అవుతుందని, వెంటనే మురుగు తొలగించి పనికిరాని మొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ కనకరాజును అడగగా సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తామని అన్నారు.
– న్యూస్‌టుడే, బెలగాం

ప్రమాద సూచికలేవీ?

బలిజిపేట మండలంలోని ప్రధాన రహదారుల్లో పెద్ద మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్లు, భవనాల శాఖ అధికారులు వేగ నియంత్రికలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయనందున వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. వంతరాం నుంచి గళావల్లి వైపు వెళ్తున్న వాహనాలకు కొండ వద్ద ఉన్న మలుపులో ఎదురుగా వస్తున్నవి కనిపించడం లేదు. ఈ విషయంపై ర.భ. శాఖ జేఈ జయరాజును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట



బాగు చేస్తే ఉపయోగం



పార్వతీపురం మండలంలోని నర్సిపురం బీసీ కాలనీలోని మండల సామాజిక భవనం వినియోగం లేక తలుపులు తుప్పు పట్టి భవనం పాడవుతోంది. చెత్త పెరిగి విషజంతువుల ఆలవాలంగా మారుతోంది. దీని పక్కనే డిపెప్ ప్రాథమిక పాఠశాలకు పిల్లలు వచ్చీ వెళ్లడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని బాగుచేస్తే అటు వినియోగానికి, ఇటు పిల్లలకు విషజంతువుల భయం తగ్గుతుందని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. విషయం ఎంఈవో- 2 ప్రసాదరావు మాట్లాడుతూ.. పూర్తి స్థాయిలో పరిశీలించి, తదుపరి చర్యలకు ప్రతిపాదిస్తానన్నారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

పేరుకుపోయిన మురుగు



కురుపాం మండలం శివ్వన్నపేటలో ప్రధాన రహదారి పక్కన కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో మురుగు పేరుకుపోయింది. కాలువలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి అధ్వానంగా మారింది. దుర్వాసన, పందుల సంచారంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఫిర్యాదులు అందాయని, పరిశీలించి శుభ్రం చేస్తామని పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర్ తెలిపారు.
– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

శిథిలం పదిలమా?

జియ్యమ్మవలస మండలంలో పెదమేరంగి పంచాయతీ జోగిరాజుపేటలో గతంలో ఎంపీల్యాడ్స్ నిధులతో నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనం లోపలి భాగం శిథిలమవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. లోపల కూర్చోవడానికి ఏర్పాటు చేసిన దిమ్మలు పూర్తిగా పాడవడంతో పాటు భవనం కూడా శిథిలం కావడంతో అక్కడ నిరీక్షించేందుకు అవస్థ పడుతున్నారు. బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, జియ్యమ్మవలస



జగజ్జననీ నమోస్తుతే


వంతరాంలో బిందెల దీపాలతో..


పార్వతీపురంలో దుర్గాదేవిగా భవానీ మాత


అఖిలాండేశ్వరి ఉత్సవ విగ్రహం



జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. గురువారం దుర్గాష్టమి సందర్భంగా వివిధ ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గౌరీ కల్యాణం, కుంకుమ పూజలు, ఘటాభిషేకాలు కొనసాగాయి. బలిజిపేట మండలం వంతరాంలో బిందెల దీపాలు సమర్పించారు. పార్వతీపురం, జీఎల్‌పురం, జియ్యమ్మవలస, పాలకొండ, సాలూరు, భామిని, సీతానగరం, కురుపాం ప్రాంతాల్లో అమ్మవారి పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
–న్యూస్‌టుడే బృందం


తాళ్లబురిడిలో గౌరీకల్యాణం పూజల్లో భక్తులు


బత్తిలిలో కోటదుర్గ అమ్మవారికి అష్టోత్తర శత ఘటాభిషేకం


జీఎల్‌పురంలో ఘటంతో ఎమ్మెల్యే జగదీశ్వరి

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి


కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త పాత్రో

పాచిపెంట, న్యూస్‌టుడే: సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక పంట దిగుబడి సాధించొచ్చని శాస్త్రవేత్త పీవీఎస్ఎస్‌కే పాత్రో, ప్రకృతి వ్యవసాయ ప్రాంతీయ అధికారి కె. ప్రకాశ్ తెలిపారు. గురువారం పి.కోనవలస రైతులకు కషాయాలు తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. జిల్లేడ కషాయంలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించొచ్చని వివరించారు.

తెదేపా సభ్యత్వ నమోదుపై శిక్షణ


యాప్‌లో నమోదుపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదుపై ఆపార్టీ కార్యాలయంలో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. టెలిగ్రామ్ యాప్‌లో సభ్యత్వం ఎలా నమోదు చేసుకోవాలో శిక్షకులు వివరించారు. నియోజకవర్గ బాధ్యులు పడాల భూదేవి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ యాప్‌లో సభ్యత్వాలు తీసుకోవాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు, సహజ మరణానికి రూ.30వేలు బీమా సదుపాయం ఉంటుందన్నారు.

19 లోగా దరఖాస్తులు చేసుకోవాలి

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాలలో తాత్కాలిక పద్ధతిపై పీజీటీ గణితం, పీజీటీ భౌతికశాస్త్రం గెస్ట్ టీచర్ ప్రాతిపదికగా పని చేసేందుకు ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఈ నెల 19 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు.

కేజీబీవీ ప్రిన్సిపల్‌గా ఉషారత్నకుమారి

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండలంలోని రేగులపాడు కేజీబీవీ ప్రిన్సిపల్‌గా దాసరి ఉషారత్నకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా జి.సిగడాం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భామిని, న్యూస్‌టుడే: భామిని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టులకు పొరుగుసేవలు ప్రాతిపదికన భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో ఏ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అర్హులైన మహిళలు నుంచి దరఖాస్తుల వివరాలు ఈ నెల 15 లోపు ఎంఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

15న సాలూరులో ఉద్యోగమేళా

పార్వతీపురం, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15న సాలూరు నియోజకవర్గ కేంద్రంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి చైతన్య గురువారం తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. పదో తరగతి, ఆపై విద్యార్హతలు ఉండి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉన్న యువతకు ఉద్యోగావకాశాలను కల్పించేందుకు సంస్థలు వస్తున్నాయని తెలిపారు.

నేడు అంతర్జాతీయ బాలికా దినోత్సవం

పార్వతీపురం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఈనెల 11న శిశు, మహిళా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొంటారు.

పల్లె పండగ వారోత్సవాలపై అవగాహన

భామిని, న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి పల్లె పండగ పంచాయతీ వారోత్సవ కార్యక్రమంలో ప్రతీ ఉద్యోగి భాగస్వాములు కావాలని ఎంపీడీవో జి.చంద్రరావు కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, సంక్షేమ సహాయకులతో సంక్షేమాలు, సర్వీసెస్, గ్రామాభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. ఈవోపీఆర్‌డీ కృష్ణారావు, కార్యదర్శులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

గిరిశిఖరాల్లో సంకల్పం



కొమరాడ: గిరిశిఖరాల్లో పోలీసు శాఖ అధ్వర్యంలో సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. జొప్పంగిలో ఎస్ఐ నీలకంఠం యువతకు గంజాయి, మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరించారు. చదువుకున్న యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వృత్తి విద్యలతో భవిష్యత్తు

పార్వతీపురం గ్రామీణం: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో ఆసక్తిని గమనించి, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని పెదబొండపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఐ.గౌరి అన్నారు. పాఠశాల నుంచి ఎంపికైన పదో తరగతి విద్యార్థులకు రొట్టెల ఫ్యాక్టరీలో వివిధ తయారీలపై అవగాహన కల్పించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆహారోత్పత్తులు, ప్రోగ్రాం మైండ్ లీడర్స్, కంప్యూటర్స్ విభాగాల్లో 40 మంది విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

మర్యాదపూర్వకంగా కలయిక

కురుపాం గ్రామీణం: కురుపాం మండలం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన జె.ఉమామహేశ్వరి గురువారం తెదేపా రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్‌చంద్రదేవ్‌ను కురుపాం కోటకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికల గురించి చర్చించారు.

కేంద్ర బృందం సందర్శన

సీతంపేట: సీతంపేటలోని గిరిజన యువత శిక్షణా కేంద్రం(వైటీసీ)లో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజ్‌ను నేషనల్ లెవెల్ మోనటరింగ్ టీమ్ సందర్శించింది. బృందం ప్రతినిధులు సశ్యపాన్, సలీమ్ కుమార్ తదితరులు శిక్షణార్థులతో మాట్లాడారు. వారితో పాటు జేడీఎం రమణమూర్తి, ఉపాధిహామీ ఏపీడీ శ్రీహరిరావు, వైటీసీ మేజేజర్ వెంకటరమణ, స్కిల్ డెవెలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ టమాటాకు బారులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ధరల నియంత్రణలో భాగంగా రైతు బజారులో ప్రారంభించిన రాయితీ టమాటాకు మంచి స్పందన కనిపిస్తోంది. రోజుకు వంద కిలోలకు పైగా విక్రయాలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో టమాటా రూ.80 వరకు పలుకుతోంది. ఈ ధర సామాన్యులపై తీవ్ర భారం మోపడంతో అధికారులు రాయితీ విక్రయాలు ప్రారంభించారు. ఆధార్ కార్డు తీసుకొని వచ్చేవారికి కిలో టమాటా చొప్పున అందజేస్తున్నారు. ఎస్టేట్ అధికారి సంధ్యన, సహాయకుడు రమణ విక్రయాలు సాగిస్తున్నారు.


బారులు తీరిన వినియోగదారులు

పత్తిలో మెలకువలు పాటించాలి

భామిని, న్యూస్‌టుడే: పత్తి పంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని ఏవో కె.సింహాచలం అన్నారు. బోడ్డగూడ గిరిజన గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సేంద్రీయ వ్యవసాయాన్ని అవలంభిస్తే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. పంట కొద్ది రోజుల్లో చేతికొస్తున్న తరుణంలో పంట ఏలా కోయాలి తర్వాత ఏఏ మందులు వినియోగించాలనే అంశాలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు.


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

పథకాల అమలు తీరుపై ఆరా!



కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై గురువారం కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. అంపిలి, ఎం.సింగుపురం గ్రామాల్లో పర్యటించి 11 పథకాల గురించి అధికారులతో మాట్లాడారు. ఈ నిధులతో చేపట్టిన పనులు పరిశీలించారు. పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ..అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నారా అని అధికారులను ప్రశ్నించారు. అంపిలి, ఎం.సింగుపురంలో కేంద్ర పథకాలపై పరిశీలించిన కమిటీ నివేదికను దిల్లీలోని ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి


శిక్షణ ఇస్తున్న అధికారిణి దుర్గా అపూర్వ

బలిజిపేట, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని సాంకేతిక సహాయకులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా జాగ్రత్తలు పాటించి కొనుగోళ్లు చేపట్టాలని సాంకేతిక సహాయకురాలు దుర్గా అపూర్వ సూచించారు. బలిజిపేట రైతు సేవా కేంద్రంలో గురువారం సాంకేతిక సిబ్బందికి, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, వ్యవసాయశాఖ సిబ్బందికి ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ధాన్యంలో తేమశాతం 17కు మించకుండా ఉండాలని తెలిపారు. సాధారణ రకం క్వింటాలు ధాన్యానికి రూ.2,300, ఎ-గ్రేడ్‌కు రూ.2,320 చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు.

పెదపెంకి వీధుల ఆక్రమణతోనే సమస్య

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపెంకిలో వీధుల ఆక్రమణతోనే మురుగు సమస్య ఏర్పడుతోందని డీపీవో రామచంద్రరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈనెల 7న 'ఈనాడు'లో 'పెదపెంకి ప్రతి వీధిలోనూ సమస్యలే' శీర్షికన వెలువడిన కథనానికి స్పందించి గ్రామంలో పర్యటించారు. వీధుల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.


వీధులు పరిశీలిస్తున్న డీపీవో రామచంద్రరావు